నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జనవరి 07, 2024 | www.navatelangana.com

బస్సు ఎక్కబోతుండగా ప్రమాదంలో వృద్ధురాలికి గాయం


గాయపడ్డ వృద్ధురాలు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని బాసర మూలమలుపు వద్ద బస్సు ఎక్కబోయి వృద్ధురాలు లచ్చవ్వ చేతికి గాయమైంది. మండల కేంద్రంలోని బాసర మూల మలుపు వద్ద బాసర వెళ్లేందుకు ఇద్దరూ వృద్ధులు వేచి ఉండగా నిజామాబాద్ నుండి బాసర వైపు వెళ్తున్న ఆర్డినరీ బస్సు కిక్కిరిసి ఉంది. డ్రైవర్ పూర్తిగా ఆపకపోవడంతో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించిన లచ్చవ్వ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో చేతికి గాయమైంది. వెంటనే గమనించిన స్థానికులు 108 లో ఆసుపత్రికి తరలించగా పోలీసులు బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

ప్రణాళిక ఆధారంగా విద్య బోధన చేపట్టాలి

- జిల్లా సమన్వయకర్త అంబటి నరసయ్య

నవతెలంగాణ-లింగంపేట్

ప్రాణాళికబద్ధంగా విద్య బోధన చేపట్టినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా సమన్వయకర్త అంబటి నరసయ్య అన్నారు. శనివారం శెట్టిపల్లి కాంప్లెక్స్ పరిధిలో ప్రధాన ఉపాధ్యాయులకు ప్రత్యేక సమీక్షాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, పాఠ్యప్రణాళిక ఆధారంగా, బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల నుండి పాఠ్య బోధనపై అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణపై పలు సూచనలు తెలియజేశారు. గ్రంథాలయం నిర్వహణపై వివరించారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, సెక్రటరీ మార బాల్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పుడెట్లుందో.. ఇప్పుడట్లే ఉంది

- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గ్రామాల్లో, తండాల్లో అభివృద్ధి శూన్యం
- పైగా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- కొన్ని తండాలకు ఎమ్మెల్యే, ఎంపీలు వెళ్లిన దాఖలాలు లేవ్
- అందుకే ప్రజలు మార్పు కోరుకున్నారు
- మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజం


పిట్లం మండలం కుర్తిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి..


బిచ్కుంద మండలం

నవతెలంగాణ-బిచ్కుంద/పిట్లం/నిజామాబాద్

'బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. పదేళ్ల పాలనలో గ్రామాలు, తండాల్లో సౌకర్యాలు లేవు, అభివృద్ధి శూన్యం. పదేండ్ల క్రితం జుక్కల్ నియోజకవర్గానికి వచ్చినప్పుడు ఎట్లుండెనో.. ఇప్పుడు కూడా అలానే ఉంది. బిచ్కుంద మండలంలోని ఎల్లారం తండాకు ఇప్పటి వరకు ఎమ్మెల్యే, ఎంపీ వచ్చినా దాఖలాలు లేవు. రెవెన్యూ శివారు లేదు. గూగుల్ మ్యాప్‌లో ఈ తాండా పేరే లేదు. ఇదీ బీఆర్ఎస్ పాలనలో పరిస్థితి. ఇవన్ని చూసే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టార'ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో శనివారం పర్యటించి పలు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలిం చారు. మొదట జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం ఎల్లారం తండాలో ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావుతో కలిసి ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని, దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం పిట్లం మండలం కుర్తి, నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టంచేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ప్రజల వద్దకు ప్రజా పాలన తెచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రెండు హామీలను అమలు చేశారని, ఆరు గ్యారంటీల అమలుకే ప్రజా పాలనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. దశల వారీగా మిగితా హామీలను అమలు చేస్తామని వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, డిసిసిబి మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి, పిసిసి డెలిగేట్ విట్టల్‌రెడ్డి, జుక్కల్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మున్నూరు నాగనాథ్, సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్, మైనార్టీ నాయకులు పాషాసెట్, బంజారా నాయకులు నౌషానాయక్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

నెలరోజులు కాకముందే విమర్శలా..?

పిట్లం : పిట్లం మండలం కుర్తి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో మంత్రి జూపల్లి పాల్గొని ప్రసంగించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే బీఆర్ఎస్ నాయకులు మా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి కూడా దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, ఉద్యోగా నియామకాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఇలా ఎన్నో హామీలను బుట్ట దాఖలు చేశారు. ప్రజలనే కాదు చివరకు మంత్రులను కూడా ప్రగతి భవన్ లోకి అనుమతివ్వలేదు. అంతే కాకుండా ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు. గ్రామాలు, తండాలు మౌలిక వసతుల్లో, అభివృద్ధిలో గతంలో ఎట్లా ఉండేనో ఇప్పుడు కూడా అట్లానే ఉన్నాయి. ఇవన్నీ గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మా ఆకాంక్షలు నెరవేరుతాయని భావించి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతాం. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రెండు హామీలను నెరవేర్చారు. ఆరు గ్యారంటీల అమలు భాగంగా ప్రజా పాలన కార్యక్రమం చేపట్టాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు తీసుకుంటున్నాం. హామీలను దశల వారీగా అమలు చేస్తామని' మంత్రి స్పష్టంచేశారు. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడారు. కార్యాక్రమంలో పిసిసి డెల్గెట్ విట్టల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు, రామ్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పి సీఈవో సాయా గౌడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ బ్రహ్మం, మాజీ జెడ్పిటిసి మురళీధర్‌గౌడ్, సర్పంచ్ మైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సునీత, పార్టీ సీనియర్ నాయకులు, ఆయా శాఖల జిల్లా అధికారులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండొద్దు

మహిళలకు గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండరాదని మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఆదేశించారు. కుర్తిలో మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పట్ల పలువురు మహిళలకు పూర్తి అవగాహన లేదన్నారు. ఓ కార్యక్రమంలో ఒక మహిళ గ్యాస్ సిలిండర్‌కు టిక్ చేయకుండానే దరఖాస్తు చేస్తుంటే ఏంటమ్మా 500 గ్యాస్ సిలిండర్‌కు టిక్ చేయలేదని ప్రశ్నిస్తే తమకు గ్యాస్ కనెక్షన్ లేదని సమాధానమిచ్చినట్లు వివరించారు. అందుకుగాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కంపెనీల, ఏజెన్సీ డీలర్‌లు, ఎమ్మెల్యేల, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కలెక్టర్‌కు సూచించారు.

గ్యాస్ కనెక్షన్ నిమిత్తం 2065 రూపాయలకు సిలిండర్, కనెక్షన్, రెగ్యులేటర్ ఇవ్వాల్సి ఉంటే ఏజెన్సీవారు అదనముగా 2 వేల రూపాయలు అదనంగా ప్రజల నుండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కుటుంబంలో గ్యాస్ కనెక్షన్ కలిగివున్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబంలో వ్యక్తి పేరు మీద మార్చటానికి డీలర్‌లు డబ్బులు దండుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు లబ్ధి జరగాలి కాబట్టి పెద్ద వహించాలని సూచించారు.


కౌలాస్‌కోట విశిష్టతను తెలుసుకుంటున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

కౌలాస్‌కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం

- పర్యటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


మ్యాప్‌లో కౌలాస్‌కోట వివరాలు తెలుసుకుంటూ..

నవతెలంగాణ-జుక్కల్

అంతకుముందు చారిత్రాత్మక కౌలాస్ కోటను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంత్ రావ్, కామా రెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తో కలిసి కౌళాస్ కోటను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలాస్ కోట ప్రాధాన్యత గురించి జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన కౌలాస్ కోటను అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. దీనిపై ప్రతిపాదనలు రూపొందించి, నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌలాస్ కోట అభివృద్ధిపై త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా స్వాగతం పలికారు. ఎంతో చరిత్ర గల ఈ కోటను పాలకులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరిందనీ, కోట వారసులు అనూప్ కుమార్ సింగ్, జిల్లా కలెక్టర్‌కు, మంత్రికి వివరించారు. ప్రస్తుతం కోట లోకి వెళ్లేందుకు వాగుపై వంతెన నిర్మాణం చేయాలని, దీంతో పాటు గానే కోట బాగుకు నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధుశర్మ, రాజ కుటుంబీకులు అనూప్ సింగ్, అనితా సింగ్, సర్పంచ్ గొల్ల హన్మండ్లు, వైస్ ఎంపిపి ఉమాకాంత్, సర్పంచులు రమేష్ దేశాయి, సాయులు, గౌళే యాదవ్, అధికారులు ఎంపిడివో నరేష్ , ఎంపివో యాదగిరి, బాన్సువాడ డిఎస్పీ, బిచ్కుంద సిఐ కృష్ణ, జుక్కల్ ఎస్ఐ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

- పథకాల అమలుతో పాటు సమస్యలపై పెద్దఎత్తున వినతులు
- నిజామాబాద్‌లో 4.05 లక్షలు, కామారెడ్డిలో 3.08 లక్షల దరఖాస్తులు


దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరిన ప్రజలు

నవతెలంగాణ-నిజామాబాద్/కామారెడ్డి

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో శనివారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమంలో గ్యారెంటీ పథకాల అమలుకు వెల్లువల దరఖాస్తులు వచ్చాయి. 8 రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణను ఎలాంటి ఇక్కట్లు లేక అధికార యంత్రాంగం పర్తి చేసింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 4,05,049 కుటుంబాలకు గాను 4,77,808 దరఖాస్తులు వచ్చాయి. ఇక సమస్యల పరిష్కారంపై 1,12,564 దరఖాస్తులు వచ్చాయి. ఇక కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3,08,166 దరఖాస్తులు వచ్చాయి. అయిత దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టారు. తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం మన చేతుల్లోనే

- అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్లాస్టిక్ రహిత సమాజంగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం లైఫ్ స్టైల్ ఫర్ ఇన్వోవెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని సూచించారు. విద్యార్థి దశ నుంచి ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ వస్తువులు వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటు ందని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటం కోసం విద్యార్థులు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షణ చేస్తేనే భావితరాలకు ప్రాణవాయువు లభిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువకులు, అధికారులు కృషి చేయాలని కోరారు. పర్యావరణం బాగుంటేనే మనుషుల భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. క్రమంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా తగ్గించడానికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బట్ట సంచులను అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆవిష్కరించారు. కంపోస్ట్ ఎరువుల తయారీ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి రామ్ రెడ్డి, ఎన్జిసి ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, రాష్ట్ర కోఆర్డినేటర్ శివకుమార్, రిసోర్స్ పర్సన్ లు ప్రవీణ్ కుమార్, శ్రీధర్, ఎన్జిసి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద కాలువకు సాగునీరు విడుదల

- యాసంగి సాగుకు ఎస్సారెస్పీ నీటి విడుదల


కాలువలకు విడుదలవుతున్న నీరు

నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి ఇందిరమ్మ వరద కాలువకు యాసంగి పంటకు 2000 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేసినట్లు ప్రాజెక్టు డిఈఈ గణేష్ తెలిపారు. ప్రతి సంవత్సరం యాసంగి పంటలకు సాగనీరు విడుదల చేసే క్రమంలో సరస్వతి , లక్ష్మి , కాకతీయ కాలువలకు సాగునీరు అందిస్తుండగా శనివారం రోజున ప్రాజెక్టు అధికారులు వరద కాలువ గేట్లు ఎత్తి యసంగి పంటలకు సాగునీటిని విడుదల చేశారు. కాకతీయ కాలువ ద్వారా 3500 , లక్ష్మి కాలువ ద్వార 200 , సరస్వతి కాలువ ద్వార 600 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేస్తూ వరద కలువ ద్వార 2000 క్యూసెక్కుల సాగు నీరు అందిస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల కు 247 , అలీ సాగర్ ఎత్తిపోతలకు 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మిషన్ భగీరథ పథకం ద్వార 152 క్యూసెక్కుల తాగు నీరు అందిస్తున్నారు. ప్రాజెక్టు నుండి 384 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వధా అవుతుండగా ప్రాజెక్టు నుండి పూర్తిగా 7563 క్యూసెక్కుల నీరు బయటికి విడుదల అవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

ఎసారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టియంసిలు) కాగా శనివారం 1085.50 అడుగుల (68.433 టియంసిల) నీరు నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ ద్వార 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందున వరద కాలువ పరిసర ప్రాంతాలలో చేపలు పట్టే వారు , పశువుల కాపర్లు , రైతులు, వరద కాలువ పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు సూచించారు. కాలువల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా కోరారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- రైతులకు సరిపడా ఎరువులు సిద్ధం
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను ఉద్యోగులు జాగ్రత్తగా కంప్యూటర్లో ఆన్లైన్ చేయాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లిలో గల ఇందూర్ బి.ఎడ్ కళాశాలలో దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో 72 వేల దరఖాస్తులు వచ్చాయని అందులో 69000 ఇండ్లు ఉంటే అందులో 3000 దరఖాస్తు ఎక్కువగా వచ్చాయని అన్నారు .వాటిని పరిశీలించి కుటుంబాల సంఖ్య పెరిగితే అందరికి న్యాయం చేస్తామన్నారు. కొన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు కావాలని, సిలిండర్ల వినియోగంపై పెంచాలని, పెన్షన్లు కావాలని ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు .17వ తేదీ వరకు ఆన్లైన్ ప్రక్రియ అధికారులు జాగ్రత్తగా నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు. కంప్యూటరీకరుణ పూర్తయిన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. అధికారులు ఆన్లైన్ చేయడంలో ఎలాంటి పొరపాట్లు చేయరాదని ,కంప్యూటర్ సిబ్బంది జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. త్వరలో విద్య వ్యవస్థ పై సమీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణత శాతం పెరగడానికి చర్యలు చేపడతామన్నారు. పలుచోట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల సంఖ్య పెరగడంలో శ్రద్ధ చూపడం లేదని అన్నారు. పెంటాకలాన్ లో 36 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని ఇలా విద్యార్థుల సంఖ్య తక్కువ కావడానికి కారణమైన ఉపాధ్యాయులపై చర్యలు చేపడతా మన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిని ఉపేక్షించబమన్నారు. నిరుపేదలు వారి పిల్లలు భవిష్యత్తు బాగుపడాలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే కొంతమంది ఉపాధ్యాయుల తీరుతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. జిల్లా అధికారులు వెనుకబడిన విద్యార్థుల కోసం జనవరి, ఫిబ్రవరిలో ప్రైమరీ పరీక్షలను నిర్వహిస్తున్నారని వారిని అభినందించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారు చదువులో రాణించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. విధులలో నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే జిల్లాలో 90 వేల ఎకరాలలో రైతులు నాట్లు వేశారని వారికి సరిపడా ఆరు లక్షల టన్నుల ఎరువులు ఉన్నాయన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు ఉన్నాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకార సంఘాల వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని అన్నారు. దాంతో ఎక్కడికక్కడ బకాయిలు పేరుకుపోయి సహకార సంఘాలు నష్టాలకు గురయ్యారని అన్నారు. త్వరలో సహకార సంఘాలలో బకాయిలను వసూలు చేసి ఎరువులు కొంటమన్నారు. ఇప్పటికే 67% ఎరువులు దిగుమతి చేసుకోవడం జరిగిందని, అందులో 25% శాతం ఎరువులు రైతులకు ఇచ్చామని, మరో 25% ఎరువులు గోదాములలో సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కావున రైతులు ఇలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, తాసిల్దార్ గంగాధర్, మునిసిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, గంగ శంకర్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

- ఫ్యాక్టరీకి తరలిస్తుండగా కట్టె విరిగి ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డ చెరకు


ట్రాక్టర్‌పై నుంచి కిద్ద పడ్డ చెరుకు కట్టలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎప్పుడూ రద్దీగా ఉండే రోడ్డులో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఫ్యాక్టరీకి తరలిస్తుండగా.. ట్రాక్టర్‌కు ఇరువైపులా సపోర్ట్‌గా ఉన్న కర్ర విరిగి చెరుకు కట్టలు కిందపడ్డాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ఈ ఘటన ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోనిఇ డీఎస్పీ కార్యాలయం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌లోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి నిత్యం చెరుకు తరలిస్తుంటారు. అయితే అధికంగా లోడ్ చేసుకొని.. కనీస ప్రమాణాలు పాటించకుండా తీసుకెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాగ్రత్తలు పాటించకుండా తరలిస్తుండగా.. ఇలా ప్రమాదవశాత్తు కింద పడిన సమయంలో ఎవరైనా ఉంటే వారి ప్రాణాలకు ప్రమాదంగా మారుతున్నాయి. కనీస జాగ్రత్తలు పాటించేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

డిప్యూటేషన్ క్యాన్సిల్..

- మా పశువైద్యులు మాకు వచ్చారు : సర్పంచ్ విఠల్

నవతెలంగాణ-మద్నూర్


పశువైద్యులు బండివార్ విజయ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

మండలం లోని మేనూర్‌లో పశు వైద్యులుగా విధులు నిర్వర్తించిన బండివార్ విజయ్ కుమార్ డిప్యూటేషన్ క్యాన్సిల అయి తిరిగి విధుల్లోకి శనివారం చేరారు. ఈ సందర్భంగా తమ పశు డాక్టర్ తిరిగి తమ గ్రామానికే వచ్చారని సర్పంచ్ విఠల్ హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఎవరో ఏదో చెప్పారని పశువైద్యుడిని బాన్సువాడ రైతునగర్ పశువైద్య డాక్టర్‌గా డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్టు తెలిపారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా బదిలీ చేయడంతో అప్పటి నుంచి ఆయన సెలవులపై వెళ్లారు. ప్రభుత్వం మారగానే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జుక్కల్ ఎమ్మెల్యేగా గెలిచిన తోట లక్ష్మి కాంతారావు మేనూర్ పశువైద్య డాక్టర్‌ను వెంటనే డిప్యూటేషన్‌ను క్యాన్సిల్ చేయిస్తూ మళ్లీ యధావిధిగా మేనూర్ డాక్టర్‌గా జాయిన్ కావాలని ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఆయన విధులు చేపట్టినట్టు తెలిపారు. పశువైద్యుడిని కావాలనే ఉద్దేశ్యపర్వకంగా డిప్టేషన్‌పై బదిలీ చేశారని, ఇక్కడే ఉంటానని ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు.

ఎమ్మెల్యేకు సుందరయ్య కాలనీ గుడిసె వాసుల వినతి



నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీ గుడిసె వాసులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇండ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు కేటాయించాలని శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజా పాలన దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలోని గుడిసె వాసులకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు, కరెంటు మీటరు, ఇంటి నెంబర్లను కేటాయించే విధంగా సహకరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. డబుల్ బెడ్ రూమ్ ప్రక్రియలో భాగంగా నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్, సావిత్రి, సుశీల తదితరులున్నారు.

పొతంగల్‌లో కోతుల బెడద



నవతెలంగాణ-పొతంగల్

మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైందని ప్రజలు అంటున్నారు. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి రావడంతో ప్రజలు జంకుతున్నారు. నిత్యం ఇండ్లపై తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్న పిల్లలు, పెద్దలు ఏదైనా వస్తువులు తీసుకుని ఇంటి బయటకి రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కోతులు అటవీ ప్రాంతానికి వెళ్లేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్చరి అసోసియేషన్ ఫెడరేషన్ సమావేశానికి పలువురు హాజరు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఢిల్లీలో జరిగిన అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మీటింగ్‌కు నిజామాబాద్ అర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి హాజరయ్యారు. ఢిల్లీలో జరిగిన ఆర్చరీ అసోసియేషన్ ఫెడరేషన్ త్వరలో జరిగే ఎన్నికల మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ మీటింగ్‌లో వివిధ రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని ఈ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు చర్చించినట్లు అయన తెలిపారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు కేంద్ర మంత్రి అర్జున్ ముండా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షులు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సచిదేవ్, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి, హైదరాబాద్ అసోసియేషన్ కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతోనే విద్యార్థుల భవిష్యత్

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ రఘురాజ్ అన్నారు. నిజామాబాద్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అకాడమిక్ సమీక్ష సమావేశాన్ని ప్రిన్సిపాల్ నుస్రత్ జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి మాట్లాడుతూ.. రానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అనుమానాలను నివృతి చేయాలని అన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

సారంగాపూర్ బీఈడీ కళాశాలలో యోగ వర్క్‌షాప్ ప్రారంభం



యోగ గురువుకు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాలలో యోగా వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. కానీ ప్రస్తుత రోజుల్లో ప్లాస్టిక్ పేపర్ల వాడకం ఎక్కువైందని, ప్లాస్టిక్ ద్వారా పాలిమర్ అనేక రోగాలు, క్యాన్సర్ వంటివి కూడా వస్తాయని విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం నిజామాబాద్ యోగ సిద్ధిరాములు మాట్లాడుతూ.. మనం మంచి విషయాలు నేర్చుకోవాలని, నేర్చుకున్నది పదిమందికి పంచాలని సూచించారు. ఎవరికీ మన ద్వారా ఇతరులకు కష్టం, నష్టం, బాధ, దు్ఖం రాకుండా చూసుకోవాలని ఆ విధంగా చూసుకుంటే ఈ పోలీసులే అవసరం ఉండదని తెలిపారు. అలాగే మనం ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ఈ ఆస్పత్రులు సైతం అవసరం ఉండదని పేర్కొన్నారు. అనంతరం అతని తనయుడు శ్రావణ్ వచ్చి యోగా గురించి విద్యార్థులకు బోధించి ప్రయోగంగా ఆసనాలు చేసి చూయించారు. అనంతరం యోగా సిద్ధిరాములు గురువుకు, తనయుడు శ్రవణ్‌కు విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ నూతన నగర కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతనకర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేంపుల నాగరాజు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రేవంత్, జిల్లా ప్రధాన ఎనుగందుల మురళి నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో ఓ ప్రైవేటు సంస్థ వద్ద అందజేశారు. నూతనంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బురుగుల వినోద్, నిజామాబాద్ పట్టణ అధ్యక్షులుగా దాత్రిక రతన్, ఉపాధ్యక్షులుగా కరిపె గుండాజి శ్రీనివాస్, పద్మ సుభాష్, సెక్రటరీగా నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్, మోతి రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొటేష్‌కు నియామకపత్రాలను అందజేశారు. అనంతరం నేరెళ్ల శ్రీనివాస్‌కు కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్ కుమార్, సందీకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి/బోధన్/రెంజల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని అన్నారు. ప్రజాపాలన పేరిట గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఊహించడానికి రెట్టింపు స్పందన ప్రజల నుంచి వచ్చిందని తెలిపారు. దరఖాస్తు స్వీకరణ గడువు నేటితో ముగిసినందున అన్నింటిని కంప్యూటర్లలో క్రోడీకరించి సెక్రటేరియట్‌కు అనుసంధానం ఇస్తారని అన్నారు. అక్కడ లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ సహాయం అందిస్తుందని తెలిపారు. అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆయన హితవు పలికారు. ఎడపల్లి మండలంలోని 17 గ్రామపంచాయతీల నుంచి శుక్రవారం నాటికి సుమారు 9385 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో గోపాలకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 750 ఆర్జీలను ఆన్లైన్ కంప్యూటర్‌లో నమోదు చేసినట్లు ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం ఉదయం 7 గంటలకే విధులకు చేరుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. బోధన్ ఎమ్మెల్యే వెంట బోధన్ పురపాలక శాఖ చైర్పర్సన్ తూము పద్మవతి, కౌన్సిలర్ శరత్ రెడ్డి, ఆర్డీఓ రాజాగౌడ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బిల్లా రామ్మోహన్, మానాల మోహన్‌రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు గంగాధర్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు నారాయణ చౌదరి, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఈరెంటి లింగం, కోసిగి సాయిరెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, లింగం, కామప్ప తదితరులున్నారు. అంతకుముందు ఎడపల్లి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. బోధన్ నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఇర్ఫాన్, ఎడపల్లి ఎంపిటిసి షేక్ జావిద్ బాబా, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ట్రాన్స్‌కో విద్యుత్ శాఖ ఏడిఈ రవి నాయక్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేను సన్మానించిన ఎడపల్లి కాంగ్రెస్ నాయకులు..

మండల ప్రజాపరిషత్ కార్యాలయన్ని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సందర్శించగా.. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి శాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన తొలిసారిగా ఎడపల్లికి రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు, నాయకులు బిల్లా రామ్మోహన్, కోశాధికారి బొబ్బిలి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, నాయుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బీఎడ్ విద్యార్థులు.. (ఫొటో)

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలోని ఇందూర్ బీఎడ్ కళాశాల విద్యార్థులు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. కళాశాల భవనంలో ప్రజాపాలన దరఖాస్తులను ఉద్యోగులు కంప్యూటరీకరణ చేస్తుండడంతో వాటి పరిశీలనకు వెళ్లిన ఆయనకు బీఎడ్ విద్యార్థులు కలిసి సన్మానించారు. ప్రభుత్వం త్వరలో డీఎస్సీలో ఉద్యోగాలు భర్తీ చేస్తుండడంతో బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట కళాశాల అధ్యాపకులున్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌ల అవినీతిపైసమగ్ర విచారణ జరిపిస్తాం..

రెంజల్: మండలంలో నిరుపేదలకు మంజూరైన రెండు పడకల గదిలో నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే ఉన్నతాధికారులతో విచారణ జరిపిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ప్రజాపాలన ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పది రోజులుగా నిరుపేదలు ఆరు గ్యారెంటీ పథకాలపై దరఖాస్తులు చేసుకోగా, వాటిని ఆన్లైన్లో నమోదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై ఎలాంటి భయాందోళన చెందవద్దని త్వరలోనే అర్హులైన వారందరికీ పథకాలు వర్తింప చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యాశాఖలపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా బోధనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రభుత్వ పాఠశాలలో కనీసం 400 మంది విద్యార్థులు చదువుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. బోధన్ పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడమే కాకుండా విద్యాబోధనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొనున్నట్లు ఆయన చెప్పారు. ఎగ్జామ్స్‌కి మరో రెండు నెలలు గడువు ఉన్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ద్వారా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈనెల 17లోపు ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్లో నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ మంజూరైన డబ్బులు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి రామారావు, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్‌ఖాన్, మాజీ జెడ్పీటిసి నాగభూషణం రెడ్డి, స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, జి.సాయిరెడ్డి, సాయిబాబాగౌడ్, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి: ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోధన్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విద్యార్థులు



రెంజల్: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అయోధ్య పూజిత అక్షింతల వితరణ

నవతెలంగాణ- విలేకరుల బృందం

ఆర్మూర్: నూతన ఆలూరు మండల కేంద్రంలో శనివారం అయోధ్య పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి అధ్వర్యంలో ఈ నెల 22వ శ్రీరామ జన్మభూమిలో శ్రీ రామ్‌లాల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రాములవారి అయోధ్య పూజిత అక్షింతలు వచ్చిన సందర్భంగా ప్రతి గడపకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్ దంపతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని అమ్రాద్, మామిడిపల్లి, మామిడిపల్లి తండా, చిన్నాపూర్, గుత్ప, మాక్లూర్, చిక్లీ, మాదాపూర్, కృష్ణనగర్ గ్రామాల్లో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన పూజిత అక్షింతలతో పాటు ఆహ్వాన కరపత్రము రాముని మందిర ఫోటో అక్షంతాల వితరణ శనివారం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలకు వాటి అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల యువకులు, గ్రస్తులు పాల్గొన్నారు.



అక్షింతలు అందజేత

అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలు గడపగడపకు వితరణ..

బాల్కొండ: మండల కేంద్రంలో పవిత్ర అక్షింతల వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సంబంధించిన సభ్యులు గ్రామం మొత్తం భజన కార్యక్రమంతో మంగళ హారతులతో మహిళలు చిన్నపిల్లలు రామనామ స్మరణతో భక్తిశ్రద్ధలతో అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కత్రోజు నరేందర్, సల్ల నరసయ్య, ఐడియా రామకృష్ణ, రామకిషన్, కత్రోజు శ్రావణ్, ఆరెపల్లి నరసయ్య, తోట నవీన్, ఠాకూర్ రాము, సిరియాల కార్తీక్, ముత్యాల నందిన్, పొడపల్లి ధనదీప్, తోట మహేష్, భూసం రాజేందర్, నల్లమోహన్, రామన్, శివ, కందారపు రమేష్, తోట చిన్నయ్య, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ సిహెచ్.కిషన్, అయ్యప్ప ఆలయ పూజారి గణేష్ పంతులు, వై.లింగాగౌడ్, మెడికల్ నరేందర్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలను పల్లకిలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

బాల్కొండ: మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలు గడపగడపకూ వితరణ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మందిరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించాలి

నవతెలంగాణ-మెండోరా

ఉపాధ్యాయ పదోన్నతులు వెంటనే కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం టిఎస్ యుటిఎఫ్ క్యాలెండర్‌ను మెండోరా మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఎంపిపి బురకల సుకన్య కమలాకర్, డిప్యూటీ జెడ్పి సీఈవో రాజన్, టీఎస్ యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఒకే క్యాడర్‌లో ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారని, తీరా ఇప్పుడేమో టెట్ అర్హత ఉండాలంటూ ఆందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. టెట్ నుంచి మినహాయింపునిచ్చి ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో శ్రీనివాస్, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఎంఎన్‌ఓ రమేష్, టీఎస్ యుటియఫ్ మండల బాధ్యులు భూమేశ్వర్, ప్రవీణ్, చంద్రశేఖర్, సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటరమణ, రమేష్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ యూనివర్సిటీ కమిటీ

నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేయాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ యూనివర్సిటీ కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జనవరి 6న జరుగనున్న మాదిగ విద్యార్థుల (ఎంఎస్ఎఫ్) జాతీయ మహాసభకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుమతి నిరాకరించినందుకు నిరసనగా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో యూనివర్సిటీ అధ్యక్షులు దినేష్ మాదిగ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంఛార్జి శనిగరం మురళి కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి రాజశేఖర్, వైఎస్సార్సీపీ నాయకులుగా వ్యవహరించడం తగదన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అన్ని విద్యార్థి సంఘాలకు, అధికార ప్రతిపక్ష అనుబంధ విద్యార్థి సంఘాలకు సమావేశాలు పెట్టుకోడానికి అనుమతి ఇచ్చి మాదిగ విద్యార్థుల సమావేశానికి అనుమతి నిరాకరించడం అంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, విసి బానిసత్వం చెయ్యడమే అవుతుందని విమర్శించారు. మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) జాతీయ మహాసభకు అనుమతి నిరాకరించి, మాదిగల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వైస్ ఛాన్సలర్ పి.రాజశేఖర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, నాయకులు రమణ, సైమన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్‌లో కాలిగ్రఫీ డే

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో కాలిగ్రాఫీ డేను శనివారం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కిఫ్సిస్ సంస్థ ఆధ్వర్యంలో 10 రోజుల నుంచి విద్యార్థులకు కాలిగ్రాఫీ, అమెరికన్ యాక్సెంట్ తరగతులపై శిక్షణ నిర్వహించారు. అందమైన చేతిరాతతో విద్యార్థులు రాసిన వివిధ ఇంగ్లీష్ స్టోరీస్, పోయేమ్స్‌లను ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారుల రాసిన ఇంగ్లీష్ స్టోరీస్‌లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దిన కాలిగ్రాఫీ ట్రైనర్ ప్రభాకర్ దత్తను స్కూల్ యాజమాన్యం సత్కరించింది. విద్యార్థులలోని సృజనాత్మకను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హన్మండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలిగ్రాఫీ దేను జరుపుకుంటున్న విద్యార్థులు

అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధన వేణి శనివారం తెలిపారు. పీహెచ్‌డీ నెట్ సెట్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఈనెల 11లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, రాత పరీక్ష, డెమో ఇచ్చి అర్హులైన వారికి 19న ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఆసక్తిగల మహిళ అభ్యర్థినీలు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

23వ వార్డులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 23వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శనివారం విశేష స్పందన లభించింది. ఆఖరి రోజు కావడంతో కాలనీవాసులు తమ దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వన్నెల్ దేవి లావణ్య, అయ్యప్ప ఆలయ నిర్మాణ కర్త అయ్యప్ప శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనవాదులారా ఏకంకండి

- ప్రతి ఇంటికి యశోబుద్ధ క్యాలెండర్



క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బహుజన వాదులారా ఏకం కావాలని మండల బహుజనవాది విజయ అన్నారు. మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో యశోబుద్ధ క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహుజన వాది విజయ మాట్లాడుతూ.. బహుజనుల ఇంటికి యశోబుద్ధ క్యాలెండర్‌ను అందించి బుద్ధుడు, అంబేద్కర్ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో మనోహరాబాద్ గ్రామ బహుజనవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఖండోబా విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఖండోబా విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ, శిఖర స్థాపనలో గ్రామానికి చెందిన ఆడపడుచులు తిరిగి తమ పుట్టింటికి చేరుకున్నారు. ఉదయం నుండి కళష పూజ నియమనిష్టతో నిర్వహించారు. విగ్రహలను గ్రామములో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అదేవిధంగా కొత్తబోరు తవ్వకం నిర్వహించారు. ఆడపడుచులు దానం చేసిన డబ్బుతో శిఖరం తయారు చేసి ప్రతిష్ఠంచారు. గ్రామంలో మహ అన్నదానం చేపట్టారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనీయర్ నాయకుడు ఎంపిటిసి సునితా విజయ్ పటేల్, మాదారావ్ దేశాయి నీలుపటేల్, లాడేగాం మాజీ సర్పంచ్ రామ్ రావ్ నాయక్ , ఎఫ్ఎ సుభాష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కాలేజీలో యోగా ఎడ్యుకేషన్‌పై శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి



తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న కర్షక్ బీఈడీ కళాశాలలో శనివారం లైఫ్ స్కిల్స్ ప్రాజెక్టులో భాగంగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె రషీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఈడీ శిక్షణలో భాగంగా. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులకు నిర్వహిస్తూ నట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా యోగాను తమ జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని, భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా విద్యార్థులకు యోగా శిక్షణను అందించే విధంగా తయారు కావాలని బీఈడీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు, అప్పలనాయుడు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



నవతెలంగాణ-విలేకరుల బృందం

నాగిరెడ్డిపేట్ : మండలంలోని పోచారం గ్రామంలో శనివారం ఇంటింటికి అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అక్షింతలను ఊరేగించి గడపగడపకు పంపిణీ చేపట్టారు. జైశ్రీరామ్ అంటూ వీధులన్నీ మారుమోగాయి.

అక్షింతలు అందజేత

రామారెడ్డి: మండలంలోని గోకుల్‌తండాలో అయోధ్య సీతారామస్వామి వారి అక్షాంతాలను శనివారం మహిళల హారతులతో స్వాగతం పలుకగా ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్, బాదావత్ గన్యా పూజారి, వసంత్ నాయక్, గంగారం కారోబరి, పరశురాం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్ మండలంలోని దన్నూర్, రుసేగావ్, గ్రామాల్లో శనివారం నాడు ఇంటింటికీ అయోధ్య శ్రీరామ అక్షింతలను ఆయా గ్రామాల యువకులు అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీ రాముని ప్రతిష్ఠాపన సందర్భంగా భారతదేశంలోని ప్రతి ఇంటికి అక్షింతలు శ్రీరాముని ఫోటో, శ్రీరాముని కరపత్రాలు అందించే కార్యక్రమం చురుగ్గా చేపడుతున్నట్టు యువకులు తెలిపారు.

నాగిరెడ్డిపేట్ తహసీల్దార్‌గా లక్ష్మణ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



నాగిరెడ్డిపేట్ మండలం తహసీల్దారుగా బి లక్ష్మణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బిచ్కుంద నుంచి బదిలీపై వచ్చినట్టు సిబ్బంది తెలిపారు. నాగిరెడ్డిపేట్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన మహేందర్ కుమార్ ఎల్లారెడ్డికి బదిలీ అయ్యారు. వీధుల్లో చేరిన తహసీల్దార్ లక్ష్మణ్‌కు ఎంపీపీ రాజదాసు, ఎంపీడీవో రఘు శాలువాతో సత్కరించారు.

బిచ్కుంద తహసీల్దార్‌గా సురేష్

నవతెలంగాణ-బిచ్కుంద



బిచ్కుంద తహసీల్దార్‌గా సురేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బిచ్కుంద తహసీల్ కార్యాలయంలో ఇప్పటివరకు విధులు నిర్వహించిన లక్ష్మణ్ నాగిరెడ్డిపేట్‌కు బదిలీ కాగా ఎల్లారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న సురేశ్ బదిలీపై బిచ్కుంద తహసిల్ కార్యాలయానికి వచ్చారు. వీరితో పాటు ఇక్కడ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించిన సాయిబాబా నిజాంసాగర్‌కు బదిలీ కాగా పిట్లం తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించిన రవీందర్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం అభయ హస్తం కార్యక్రమంలో భాగంగా ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులను డాటా ఎంట్రీ చేయడానికి 22 మంది కంప్యూటర్ ఆపరేటర్ల నియమించి ఈనెల 13వ తేదీ లోపల దరఖాస్తుల ఎంట్రీ పూర్తి చేస్తామని అన్నారు.

రైస్‌మిల్ ఆపరేటర్ల ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రైస్‌మిల్ ఆపరేటర్ల ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైస్‌మిల్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న ఆపరేటర్లు, హెల్పర్ల ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లా రైస్‌మిల్ ఇండస్ట్రీలో ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికుల గత వేతన ఒప్పందం అక్టోబర్ 31తో ముగిసిందని నవంబర్ ఒకటో తేదీ నుంచి నూతన వేతనాలు అమలులోకి రావాల్సి ఉన్నాయని, కానీ ఎన్నిసార్లు యాజమాన్యానికి విన్నవించినా స్పందించకపోవడంతో సోమవారం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కార్మికులు వేతనాలు, పనిగంటలు, పిఎఫ్, ఈఎస్ఐ, కార్మిక చట్టాలు అమలు చేయమని కోరుతున్నారన్నారు. తెలంగాణ కార్మికుల్ని పక్కనపెట్టి ఇతర రాష్ట్రాల వారిని బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి తక్కువ వేతనానికి కార్మికులను తెచ్చుకొని దాదాపు 16 గంటలు వారితో పని చేయించుకుంటూ శ్రమదోపిడీ చేస్తున్నారని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ కార్మికులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పై సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, నాయకులు రమేష్, జాఫర్, సాయిలు, లాయక్, ప్రసాద్, తిరుపతిరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల దర్యాప్తు సమర్థవంతంగా చేపట్టాలి

నవతెలంగాణ-బోధన్

పోలీసులు బాధి తుల ఫిర్యాదు మేరకు నేరాల దర్యాప్తును సమర్థవంతంగా చేపట్టాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి పోలీసులకు సూచించారు. శనివారం బోధన్ కోర్టులో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో పోలీసులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసులకు గేమింగ్ యాక్ట్ గురించి వివరించారు. అలాగే అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య పోలీసుల నేర దర్యాప్తు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో బోధన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, బోధన్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రాజు, వర్ని ఎస్ఐ కృష్ణకుమార్, బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్, రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్, రుద్రూర్ ఎస్సై రాజు, ఫారెస్ట్ అధికారులు శ్రీదేవి, లక్ష్మినారాయణ, రాజేందర్, బాలకృష్ణ, వినయ్‌కుమార్, సయ్యద్ సాబేర్, తదితులున్నారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

దరఖాస్తులను కంప్యూటీకరించాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-జుక్కల్

ప్రజాపాలన, అభయహస్తం దరఖాస్తులను వెంటదివెంటనే ఆన్‌లైన్‌లో కంప్యూటీకరించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కౌలాస్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణలో ప్రజాపాలన, అభయహస్తం దరఖాస్తులను స్వీకరిస్తున్న క్యాంపును కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూ శర్మతో కలిసి దరఖాస్తులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ దరఖాస్తుదారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని,



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్పీ, పోలీసు శాఖ అధికారులు, ఎంపిడివో నరేష్, ఎంపివో యాదగిరి, తహసీల్దార్ గంగా ప్రసాద్, ఆర్ఐ రామ్ పటేల్, ఈజీఎస్ ఈసీ స్వామీ, టీఏ రవిందర్, జేపిఎస్ లు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ రికార్డుల పరిశీలన

కౌలాస్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. టీచర్ లేకపోవడంతో ఆరా తీయగా.. దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆయా తెలిపారు. రిజిస్ట్రార్ చూపాలని సూచించగా.. తాళం వసి పెట్టలో ఉన్నట్టు తెలిపారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని , నిత్యం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

- ఎంపీ అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్/డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అరవింద్ సూచించారు. వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని పిప్రి గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అన్ని గ్రామాలకు ప్రధాని గ్యారంటీ వాహనంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు వస్తారన్నారు. అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నటువంటి క్యాలెండర్లను ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్, తహసిల్దార్ శ్రీకాంత్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ రాజగంగారం, వ్యవసాయ అధికారి హరికృష్ణ, పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్, ఐకెపి ఎపిఎం గంగారం, ఉపాధి హామీ ఏపీవో సురేష్, బిజెపి నాయకులు పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, పి ఫ్రీ రోహిత్ రెడ్డి, కేసి ముత్తెన్న, గ్రామ సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సమర సురేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఐదేళ్ల పాటు ఉచిత రేషన్

డిచ్‌పల్లి : గత కొన్ని ఏళ్ల నుండి దేశంలో రేషన్ కార్డులు కలిగి ఉన్న వారందరికీ ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తున్నమని వచ్చే ఐదేళ్ల వరకు అందజేస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లో బాగంగా అయన పాల్గొని మాట్లాడుతూ గతంలో నామ్ కే వస్తేగా ఆదరా బాదరగా నూతన మండలాలను ఏర్పాటు చేసిందని, అధికారులు లేక పోవడంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చెందడం లేదని, ఎన్ని పథకాలు ఉన్నాయో అధికారులకు తెలియడం లేదని, దీంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని, ఇది చాలా రాష్ట్రాల్లో ఉందన్నారు. ఉజ్వల పథకం లో ఉచితంగా గ్యాస్ సిలిండర్ పొందవచ్చని, ఇదే కాకుండా 700 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వస్తుందన్నారు. ఇళ్ల లేని వారికి ఇళ్ళ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షలు అందజేస్తుందన్నారు. గ్యాస్ లేని వారు ముందుగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. గతంలో ఇళ్ళ నిర్మాణంకు కేంద్ర ప్రభుత్వం నిధులు



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బులు వాడుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, తిర్మన్ పల్లి ఎంపిటిసి చింతల దాస్, ఎంపిడిఓ రాములు నాయక్, డిఎల్పిఓ నాగరాజ్, బిజెపి సీనియర్ నాయకులు కులచారి దినేష్ కూమార్, మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్,ఎపిఓ పోశెట్టి, ఎపిఎం సువర్ణ , గ్రామ ప్రత్యేక అధికారి డిప్ చంద్, కార్యదర్శి శ్రీ దర్, కరోబార్ నరేందర్, గన్నరం సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి,శిలం రాజన్న, మహేందర్, మహేష్,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గత డిసెంబర్ నెల 28న ప్రారంభమైన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. శనివారం మండలంలోని బంజారా చినూర్, మెల్ల కుంట తండా, పల్లె బోగడ తండా, గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీవో రఘు తెలిపారు. 8 రోజులుగా దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్టు తెలిపారు. ఎంపీపీ రాజు దాస్, సర్పంచులు అరుణ సౌందర్య, కేస్లీతో పాటు ఆయాగరామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని చిన్న తడగూర్ గ్రామంలో మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ మండలంలోని అవల్గావ్ గ్రామంలో ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ ప్రజాపాలన సదస్సులను శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజలకు అధికారులు సలహాలు సూచనలు అందించారు. ఇరు గ్రామాల్లో మండల అధికారులు ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను సేకరించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన 6 గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో



దరఖాస్తులను స్వీకరణ

భాగంగా శనివారం మద్నూర్ మండలంలోని అవల్గావ్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పాల్గొన్నారు. 6 గ్యారంటీ అమలు కోసం ప్రజలు అందించే దరఖాస్తులను స్వీకరణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శతేశ్వర్, ఉప సర్పంచ్ మారుతి, ఎంపిటిసి సభ్యులు సాయిలు, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, గ్రామ కార్యదర్శి వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ పరిశీలన

భిక్కనూర్ : గత నెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను బుధవారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుల డాటా ఎంట్రీని తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో అనంతరావు, ఎంపీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా డాటా ఎంట్రీ నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని వివిధ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తరపున సంబంధిత అధికారులు దుప్పట్లు అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు, పూల బొకేలకు బదులు విద్యార్థుల సౌకర్యార్థం వారికి ఉపయుక్తంగా నిలిచేలా దుప్పట్లు, నోట్ బుక్కులు అందించాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి అనూహ్య స్పందన లభించిన విషయం విధితమే. ఈ మేరకు బోధన్‌లోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ గర్ల్స్ హాస్టల్, నిజామాబాద్, రెంజల్, డిచ్‌పల్లి, ఆర్మూర్ బీ.సీ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు, అర్గుల్ బీ.సీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందజేశామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా నోట్ బుక్కులు, పెన్నులను పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు అందజేయనున్నామని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్, అనధికార ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ధనిక రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ సర్కార్ దోచుకొని అప్పుల పాలు చేసిందని, దాంతో ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం అయన అసెంబ్లీ ఎన్నికల అనంతరం మండల కేంద్రానికి మొట్టమొదటిసారి వచ్చిన సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరుగ్యారంటీలా దరఖాస్తుల చివరి రోజు ముగింపు కార్యక్రమానికి హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు, ఆయా కులసంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. ఇది గ్రహించిన రాష్ట్ర ప్రజలు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అసెంబ్లీ గేట్లను తొలగించి ప్రజాభవంగా మార్చి ప్రజా సమస్యలు తీర్చేందుకు ప్రతిరోజూ ప్రతి ప్రజలను కలిసి వారి సాదక బాధలు తీర్చనున్నట్టు తెలిపారు. అలాగే ధర్నాచౌక్ తిరిగి ఏర్పాటు చేశామని వివరించారు. టిఎస్‌పిఎస్సీని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. గెలిచినా నెలలోనే ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించి, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ప్రారంభించడం జరిగిందని, పేదలకు వైద్యం అందించే దిశగా 10లక్షల వరకు ఆరోగ్యశ్రీని పెంచి కొనసాగించనున్నట్టు వివరించారు. దశలవారీగా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రజలవద్దకు అధికారులను పంపించి సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజాపాలనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు ఈ కార్యక్రమానికి హర్షిస్తున్నారని అన్నారు. పది సంవత్సరాల నుంచి పేదలకు కనీసం రేషన్ కార్డు ఇవ్వని కేసీఆర్, కేటీఆర్‌లు ఎం మొఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. మీపాలనలో కేవలం కుటుంబ సభ్యులు పదవులు పొందారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో 11 మంది మంత్రుల్లో 4, 5 గురు దళిత బిడ్డలకే పదవులు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. ప్రజా పాలన దరఖాస్తులు ప్రతి ఒక్కరూ చేసుకోవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా తాము అభివృద్ధి చేయదలుచుకున్నామని తెలిపారు. ఏ పార్టీ అయినా ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అలాగే పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని పార్టీల నాయకులు వస్తున్నారని, మొదటి ప్రాధాన్యత జెండా మోసినవారికి తప్పకుండా ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. రానున్న రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ కష్టపడి మన పార్టీ అభ్యర్థి గెలిపునకు కృషి చెయ్యాలని అన్నారు. తన గెలుపునకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగా రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, ఆరెనోళ్ల శ్రీనివాస్, కమ్మరి గంగాధర్, భగవాన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, జాన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుబెందర్, తహసీల్దార్ మాలతి, ఎంపిడిఓ లక్ష్మణ్, అయ్యాగ్రామాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోకు ఎరువుల కొరత



మాట్లాడుతున్న కొన్నెల సాయిరెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం లో ఏర్పాటు అయిన ఎఫ్ పిఓ కేంద్రానికి ఎరువుల కొరత నెలకొంది. ప్రైవేట్ డీలర్లకు అధికంగా కేటా యిస్తూ అధిక ధరలతో అమ్ముకోమంటున్నారని మండల వ్యవసాయ అధికారుల పనితీరు పట్ల భారతీయ కిసాన్ సాంగ్ జాతీయ కార్యదర్శి కొన్నెల సాయిరెడ్డి మండిపడ్డారు. ఆయన మద్నూర్ మండల కేంద్రంలో గల ఎఫ్‌పిఓ కార్యాలయాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు సరైన మందులు అందుతున్నాయా లేదా అనే దానిపై ఆరా తీశారు. ఈ మండల భారతీయ కిసాన్ సంఘ అధ్యక్షులు చాట్ల గోపాల్ అందించిన సమాచారంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు తీరుపై అగ్రం వ్యక్తం చేశారు. ఇక్కడ రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల భారతీయ కిసాన్ సంగ్ ఉద్యమించక తప్పదని అధికారులు ఎఫ్‌పిఓ కేంద్రం పట్ల చిన్నచూపు చూడడం సరైనది కాదని అధికారుల పనితీరు మార్చుకోకపోతే రైతులకు జరిగే అన్యాయాలపై ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. రైతుల కోసం ఏర్పడిన ఎఫ్‌పిఓ కేంద్రానికి ఎరువులు అందించడంలో వ్యవసాయ శాఖ అధికారుల తీరు చూస్తుంటే ప్రైవేటు డీలర్లకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోందని తెలిపారు. ఇలాంటి తీరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు తీరు మార్చుకోకపోతే రైతుల పట్ల ఉద్యమించగా తప్పని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మద్నూర్ మండల కిసాన్ సంఘ అధ్యక్షులు ఎఫ్‌పిఓ చైర్మన్ చాట్ల గోపాల్ భారతీయ కిసాన్ సాంగ్ ప్రముఖులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముప్కాల్

2024 పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు రెంజర్ల, కేజీబీవీ పాఠశాల ఆవరణలో రాష్ట్ర, మండల పీఆర్‌టీయూ ప్రతినిధులు, నాయకుల సమక్షంలో శనివారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సామ ప్రసాద్ మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల పక్షాన నిలుస్తూ విశేష కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షులు సామ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుండోజి నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేష్‌కుమార్, మహిళ ఉపాధ్యక్షులు గీత, మండల అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి శ్రీనివాస్, ముప్కాల్, రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, జక్కుల రవి, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ జి.వినోద, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిబంధనలు పాటించాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సహకార సంఘాలలో పనిచేసే కార్యదర్శులు విధి నిర్వహణలో నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిగే పరిణామాలకు మీరే బాధ్యులని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం బోధన్ పట్టణంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన సొసైటీ కార్యదర్శులతో సమావేశమై వారి పనితీరుపై సమీక్షించారు. అలాగే సొసైటీల వారిగా రైతులకు అందుతున్న సేవలు, ఎరువుల విక్రయాలు, ఇప్పటి వరకు రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలు, నిల్వఉన్న ఎరువుల వివరాలు, ఇంకా ఎన్ని టన్నుల ఎరువులు అవసరమని ఆయన వారి నుంచి వివరాలు సేకరించారు. సంఘం గ్రామ సొసైటీ మార్క్‌ఫేడ్‌కు రూ.28 లక్షల బకాయిలు ఉండడంతో రైతులకు సరయిన సేవలు అందడం లేదని దాంతో మినార్‌పల్లి సొసైటీ నుంచి ఎరువులు కొనుగోలు చేస్తున్నామని దాంతో సంఘం సొసైటీకి రావలసిన కమీషన్ పొందలేక నష్టపోతున్నామని ఓ రైతు విన్నవించగా ఆయన మార్క్‌ఫేడ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని సంబంధిత అధికారికి సూచించారు. అలాగే రైతులకు సరిపడా ఎరువులు అందించే ఏర్పాట్లు చేయడం జరిగిందని రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని సొసైటీల కార్యదర్శులకు సూచించారు. అలాగే రైతులు పంట మార్పిడి విధానం అమలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కార్యదర్శులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవో సంతోష్ కుమార్, సొసైటీ కార్యదర్శులు ఉమాకాంత్, బస్వంత్ రావు, హనుమంత్ రావు, హనుమండ్లు కృష్ణ, పోతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
4
ఆదివారం | జనవరి 07, 2024 | www.navatelangana.com

రూ.50వేల చెక్కు అందజేత



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వ పరంగా వికలాంగుల కోటాలో మంజూరైన రూ.50వేల చెక్కును ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ ఇందల్‌వాయి గ్రామానికి చెందిన శ్రవణ్‌కుమార్‌కు ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అందజేశారు. మొబైల్ పాయింట్ సర్వీస్ కోసం రూ.50వేలను వికలాంగుల కోటాలో మంజూరైందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాములు నాయక్, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, బీఆర్ఎస్ రూరల్ ఎస్సీ సెల్ కన్వీనర్ పాశం కుమార్, సీనియర్ నాయకులు అరటి రఘు, శ్రీధర్, కార్యదర్శి భారత్, విమలభాయి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు పూజిత అక్షింతల పంపిణీ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలు శనివారం, ఆదివారం, సోమవారం ఇంటింటికి భక్త బృందం పంపిణీ చేస్తారని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఎవరికైనా రానివారు, అందుబాటులో లేనివారు ఉంటే అక్షింతలను మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఉన్న శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో పొందవచ్చని సూచించారు.

నాయకుడి కోసం మొక్కులు తీర్చుకున్న తండ్రీ కూతురు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ గెలుపొందాలని మొక్కుకున్నందుకు గానూ ఆయన గెలుపొందడంతో శనివారం అలిపిరి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు మెట్ల ద్వారా కాలినడకన వెళ్లి మొక్కులు తీర్చుకున్నట్టు మఠం పవన్, కూతురు నందిత తెలిపారు.

తడపాకల్ విద్యార్థులకు బాల ప్రతిభ పురస్కారాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

తడపాకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సమ్రీన్, సౌమ్య అనే విద్యార్థులకు 2022-2023 సంవత్సరానికి గానూ, డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాల పురస్కారానికి ఎంపికైనట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. సమ్రీన్ రాసిన ముద్దబంతి పుస్తకానికి, సౌమ్య రాసిన బంగారు బాల్యం పుస్తకాలకు ఈ పురస్కారాలు లభించాయని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ గ్రామానికి చెందిన చింతోజు బ్రహ్మయ్య జ్ఞాపకార్థం, జాతీయస్థాయిలో సాహిత్య రంగంలో రాణిస్తున్న విద్యార్థులను ఎంపిక చేసి, పురస్కారాలను అందివ్వనున్నట్టు అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, నగదు బహుమతిని అందజేస్తారని ప్రవీణ్ శర్మ తెలిపారు.

అయోధ్య రాములవారి పూజిత అక్షంత శోభాయాత్ర


అక్షంతల శోభాయాత్ర

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట గ్రామంలో సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కృష్ణారావు, ఉప సర్పంచ్ జగదీష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రాములవారి పూజిత అక్షంత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల విగ్రహాలను పల్లకిలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్రను నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ధనుంజయ్, నరసింహారెడ్డి, నాని, కృష్ణ, వెంకటేశ్వరరావు, బోసు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ


విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని తట్టికోట హైస్కూల్‌లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. దాతలు డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ప్రముఖ వ్యాపారవేత్త సురేష్, విద్యార్థులకు పరీక్ష అట్టలను, రాగిజావ తాగడానికి స్టీల్ గ్లాసులను అందించారని హెచ్ఎం ఏ.కిశోర్ తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం సేవాభావంతో ముందుకువచ్చిన దాతలకు హెచ్ఎం.కిశోర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, నాయకులు సనాపటేల్ పాల్గొన్నారు.

ట్రస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చే పూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థులు అంకాపూ ర్‌లో గల పొద్దుటూరి సదానంద ట్రస్టు వృద్ధాశ్రమాన్ని శనివారం సందర్శించారు. విద్యార్థులు ఆశ్రమమంతా కలియతిరిగి ఆశ్రమంలోని వృద్ధులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవ అనే లక్ష్యంతో తమ విద్యార్థులు ఈ ఆశ్రమాన్ని సందర్శించారని క్షత్రియ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని అందిస్తూ జీవితంలో పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందేటట్లుగా తమ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులందరు కలిసి ఆశ్రమంలోని వృద్ధులకు ఒక పూట అన్నదానం, పండ్లు, నిత్యావసర వస్తువులను అందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


చిన్నికృష్ణుడికి సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఆరోగ్యమే మహాభాగ్యం' అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి కల్తీ లేని ఆహారాన్ని పొందడం తప్పనిసరని చిన్నికృష్ణుడు అన్నారు. శ్రీ చైతన్య టెక్నో హైస్కూల్ నిజామాబాద్-1 బ్రాంచ్ పాఠశాలలో శనివారం ఉత్తమ రైతు అవార్డు గ్రహీత చిన్నికృష్ణుడు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విషపూరిత మందులు, ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువులను వాడుతూ పంటలను ఎలా పండించాలో వివరించారు. ఈ నేలతల్లి మట్టిని విషంతో కలుషితం చేయకుండా భూమిని కాపాడుతూ వ్యవసాయం ఎలా చేయవచ్చో చక్కగా విద్యార్థులందరికీ వివరించారు. దీనివల్ల ప్రతి మనిషి దీర్ఘకాలం పూర్తి ఆరోగ్యంతో ఉంటూ ఎటువంటి అనారోగ్య సమస్యల వల్ల వైద్యుల వద్దకు వెళ్ళనవసరం లేదని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం జితేందర్, ప్రిన్సిపాల్ హుస్సేన్, కో ఆర్డినేటర్ నరేందర్, అకాడమిక్ డీన్ ఈశ్వర్, ఐ.పి.ఎల్ ఇన్చార్జి శివకుమార్, సిబ్యాచ్ ఇంచార్జ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు..

- వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ జగన్నాథచారి


మాట్లాడుతున్న వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ జగన్నాథచారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శిక్షణతో ఎన్నో ఉపాధి అవకాశాలుంటాయని ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ జగన్నాథ చారి, నాబార్డ్ డిడిఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారులోని ట్రైజం సెంటర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్ శిక్షణను ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్నాథచారి మాట్లాడుతూ.. స్వయం ఉపాధి వలన కుటుంబానికి అండగా ఉంటారని, ప్రతి వ్యక్తి తాము చేస్తున్న వృత్తులతో పాటు కోళ్ళ పెంపకం, గొర్రెల పెంపకం, పశువుల పెంపకం వాటితో అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ వృత్తులకు నాబార్డ్ ఎల్లప్పుడూ సహాయకారిగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రాజిత, నవీన్, నర్మాద, ఫరీదా, బ్యూటీపార్లర్, మగ్గం శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టసభ రిజర్వేషన్ బిల్లులో ఓబిసి మహిళలకు రిజర్వేషన్ కోటాను కల్పించాలి


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా చట్టసభ రిజర్వేషన్ బిల్లులో ఓబిసి మహిళలకు రిజర్వేషన్ కోటాను కల్పించాలని భారతీయ ఛత్రపతి పూలే జాగృతి వ్యవస్థాపక సభ్యుడు బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ అన్నారు. 2023లో మహిళా చట్టసభ రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చిన అందులో ఓబీసీ మహిళలకు వారి కోటాను కేటాయించక పోవడం చాలా ఆందోళనకరమైన విషయమని, దేశంలో మహిళలో సగం పైగా ఉన్న ఓబీసీ మహిళలకు వాటా కేటాయించకపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు. మెజార్టీ ప్రజలైన మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం కోల్పోతారని, సంపూర్ణ నారిశక్తి మహిళా సాధికారత ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొ న్నారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సబ్కా సాత్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్ అనే నినాదంలో కూడా అన్నివర్గాల ప్రజల ఆకాంక్షల అనుగుణంగా పనిచేస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టి చాలా కుట్రపూరిత ప్రయత్నమని విమర్శించారు. తక్షణమే ఓబిసి కోటాను అమలుపరచి 2024 పార్లమెంటు ఎన్నికలలో అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, దినేష్, సుమలత, సంతోషి ని, లావణ్య, గీత, జ్యోతిక తదితరులు పాల్గొన్నారు.


దిపాను అభినందిస్తున్న దృశ్యం

67వ స్కూల్ గేమ్స్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం.బి వాసి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిసెంబర్ 21 నుంచి 23 వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్టాఫ్ బాల్ అండర్-17 పోటీలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ధర్మారం బి క్రీడాకారిణి దీపా జిల్లా జట్టు తరఫున పాల్గొని జట్టు బంగారు పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించి ఈనెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బికనీర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పిఈటీ జోష్న, హౌస్ టీచర్స్ దమయంతి, స్కూల్ స్టాఫ్ దిపాను ప్రత్యేకంగా అభినందించారు.



ప్రజాపాలనలో 10వేల దరఖాస్తులు

- చందూర్ మండలంలో 2984 దరఖాస్తులు

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం 10 రోజులపాటు విజయవంతంగా కొనసాగింది. వర్ని మండల పరిధిలో గల పలు గ్రామాల నుంచి అధికారులు 10వేల దరఖాస్తులు స్వీకరించినట్లు, అర్హులు వివరాలు నమోదు చేయుట 25 మంది డాటా ఎంట్రీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బషీరోద్దీన్ తెలిపారు. అలాగే చందూర్ మండలంలో పలు గ్రామాల నుంచి అర్హులైన వారి నుంచి 2984 అభయహస్తం ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించినట్లు, 8 మంది డాటా ఎంట్రీ సిబ్బంది వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేస్తారని ఎంపీడీఓ నీలావతి తెలిపారు.

పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చడం అభినందనీయం


విద్యార్థులకు ప్రశంసపత్రాల అందజేత

నవతెలంగాణ-సిరికొండ

విద్యార్థులు పోటీ పరీక్షలలో ప్రతిభను కనబరచడం అభినందనీయమని సిరికొండ మండల అభివృద్ధి అధికారి లక్ష్మి ప్రసాద్ అన్నారు. శనివారం అభ్యాస్ అకాడమీ, ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (సాట్)-2023లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి (లెవెల్ -2) ఎంపికైన సత్యశోధక్ పాఠశాలల విద్యార్థులకు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచి వివిధ సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షలలో పాల్గొని తమ ప్రతిభ సామర్థ్యాలను రుజువు చేసుకొంటూ, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉన్నత చదువులలో, భవిష్యత్తులో పోటీ పరీక్షలలో రాణించడం సులభమౌతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

- ఏఐఎస్బి నాయకుల డిమాండ్



నిరసన చేస్తున్న ఏఐఎస్బి నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్బి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని నిజామాబాద్ ప్రభుత్వం జూనియర్ కళాశాల ముందు ఖిల్లా ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్న భోజనం అమలు చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.1400కోట్ల బకాయిలను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్స్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నిధులు సకాలంలో విడుదల చేయాలని అన్నారు. జూనియర్ కాలేజ్‌లో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని, ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆలిండి యా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు రాజన్న, శ్రీను, గౌస్, రాము, ఏజస్ షకీల్, గంగప్రసాద్, ఆర్మూర్ డివిజన్ నాయకులు రమేష్‌గౌడ్, బోధన్ డివిజన్ కార్యదర్శి రాజన్న పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత బృందం అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాబృందం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని స్థానిక ప్రభుత్వ కళాశాలలో శనివారం ఎయిడ్స్‌పై కళాజాత బృందం కళాకారులతో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఐసిటిసి కౌన్సిలర్ రమేశ్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే మేనేజర్ స్రవంతి, వార్డ్ ఎన్‌జీవో కోఆర్డినేటర్ ధర్మేంధర్, స్నేహ, ఎన్‌జీవో సిబ్బంది, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ కోరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్వగృహంలో శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గత 11 సంవత్సరాలుగా బదిలీలు, ప్రమోషన్లు లేక ఒకే చోట పనిచేస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. కావున వారికి వెంటనే బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, 010 ట్రెజరీ అకౌంట్ నుంచి జీతాలు ఇప్పించాలని, హెల్త్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మిగతా ఉద్యోగుల లాగా వీరికి ఎంప్లాయి హెల్త్ కార్డు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా మోడల్ స్కూల్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.రవికుమార్, అసోసియేటేడ్ అధ్యక్షులు ఎ.మోహన్, నాయకులు సతీష్, గంగాప్రసాద్, సాయిలు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ఆరు గ్యారెంటీల 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం ముగిసినట్లు మండల ప్రత్యేకాధికారి ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ ముగిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో విడతతో ప్రజల ముందుకు వస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్నారు. అర్హులైన వారు ఆయా దరఖాస్తులను మండల ప్రజాపరిషత్, రెవిన్యూ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ వనజ రాణి, ఎంపీవో భరత్ చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 8న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు థ్రెడ్జ్ ఐటి నియామకాలు, (TME,BRE,BDE,GT, PHARMACIST, TELICALLING, Bus Captain,Technician) ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్హత (Degree/MBA/B.tech/B Pharma/ITI Diploma అని తెలిపారు. వేతనం 15000 25000, ఇన్సెంటివ్, పీఎఫ్, ఈఎస్ఐ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లా ఉద్యోగమేళా పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9581768413, 9948748428, 9948748428, 9959456793, ఫోన్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో తప్పులు జరిగితే అధికారులదే బాధ్యత..

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- అందుబాటులో సరిపడా ఫర్టిలైజర్
- ఫర్టిలైజర్ పాత బకాయిలకు చైర్మన్, కార్యదర్శిలదే బాధ్యత


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్/బోధన్

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్ నమోదులో తప్పులు జరిగితే అధికారులే బాధ్యత వహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాల యంలో ఆన్లైన్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడు తూ.. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేయవద్దని ఏవైనా తప్పులు జరిగితే అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. జిల్లాలో 75 వేల మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్ అవసరం ఉండగా ప్రస్తుతం 50వేల మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్ సొసైటీలలో అందుబా టులో ఉందని అన్నారు. ఎవరైనా పెద్ద రైతులకు లారీ ఫర్టిలైజర్ అవసరమైతే ఎటువంటి కిరాయి లేకుండా లారీని కోరిన చోటికి పంపిస్తామని అన్నారు. గతంలోని ఫర్టిలైజర్ పాత బకాయిలను వసూలు చేయాలని అన్నారు. సొసై టీలలో ఫర్టిలైజర్ పాత బకాయిలకు సొసైటీ చైర్మన్, కార్య దర్శులే బాధ్యత వహించాలని తెలిపారు. అనంతరం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సంబంధిత శాఖ రిపోర్టులను వెంటవెంటనే తనకు అందిం చాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజా గౌడ్, ఎమ్మార్వో దన్వాల్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీఓ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

బోధన్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతులు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసి పేట్ రైల్వేస్టేషన్‌లో డిఏపి రాక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఎరువుల లోడుతో వచ్చిన రైలు వ్యా గన్‌లో ఎరువులను పరిశీలించి మాట్లాడారు. రైతులు ఎరువుల కోసం ఆందో ళన చెందనవసరం లేదని రైతుల సౌకర్యార్థం ఈ యాసంగి సీజన్‌లో జిల్లాకు 70,813 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా నేటి వరకు 52,638 యూరియా అందుబాటులో ఉందని అన్నారు.

అందులో 27,541 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేసినట్టు తెలిపారు. 18,184 డిఏపి అవసరం ఉండగా నేటి వరకు 14,197 మెట్రిక్ టన్నుల డిఏపీ వచ్చిందని, అందులో నుంచి 9,776 మెట్రిక్ టన్నుల డిఏపి రైతులకు సరఫరా చేసినట్టు వివరించారు. నేటి వరకు సరఫరా చేయగా మిగిలిన ఎరువులు గోధములలో సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, డీసీసీ మానాల మోహన్‌రెడ్డి, ఎం.సంతోష్, తాహెర్‌బిన్ హందాన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.